# భస్మాసురుడు

శ్రీమతి ' మణిమాల '

అది డిస్ట్రిక్టు జడ్జిగారిల్లు. రిటైర్డు అయి సిటీలో పెద్దభవనం కట్టించుకొన్నాడు. చుట్టూ పెద్ద ఆవరణం. పలు వన్నెల పూలచెట్లు. క్రోటన్సు. ఆవరణంమధ్య పారిజాత చెట్టు ప్రక్కనే పాలగచ్చుఅరుగు. పద్మిని పరధ్యానంలో కూర్చొంది. అష్టమీచంద్రుడు మబ్బు ముసుగులో పయనం సాగిస్తున్నాడు భావపరంపరల్లో కొట్టుకు పోతూన్నది. పద్మిని. చెవిలో తటాలున మామగారి మాటలు గింగురుమన్నాయి. "నువ్వు వాణ్ణి చూట్టానికివెళ్ళకూడదు. ఈమాటు వానికి బుద్ధిరావాలి! తప్పక వస్తుంది కూడానూ. ఏం అమ్మాయీ మాటాడవా....పట్టుబట్టావా ... పుట్టింటికి కెళ్ళాల్సిందే నువ్వు కూడాను. బారిస్టర్ అవుతాడని అబ్బ! ఎంత సొమ్ము తగలెట్టేశా "

"పుట్టింటి కెందు కెళ్తానండీ! మెట్టినింటిలో వుండక. ఇదినాయిల్లుగాదూ"

"అన్నీ నా స్వార్జితం గుర్తుంచుకో! ఈనిమిషందాకా నే పెట్టాల్సిందేనా మీకు. మీ ఇద్దరికీ హక్కు అన్నమాటలేదు. ఇంకపిల్లలకా... ఇప్పుడెందు కామాటలు ....నీవు వెళ్ళటానికి వీల్లేదు. "అంటూ గ్రామానికి వెళ్ళిపోయాడు మామ.

"అబ్బ! ఎంత పరాధీనం! అయితేనేం! వెళ్ళకమానను!" అనుకొంటూ కళ్ళు తుడుచుకొంటున్నది. "అమ్మా! అమ్మా" అంటూ పరుగెత్తుకొచ్చింది ఉష చటుక్కున ఉషను ఒళ్ళో కూర్చొబెట్టుకొని ముద్దుపెట్టుకొంది.

"నేను గెలిచా, ఒరే రవి! అమ్మను ముట్టేసుకొన్నా"నంటూ ఆనందంతో చేతులు తట్టింది ఉష. ఉషను తరుము కొచ్చిన రవి ప్రభలు తల్లి ముఖాన్ని తేరిచూచారు. ఇరు ప్రక్కలా తల్లి భుజాన్ని ఆనుకొని కూర్చున్నారు. "అమ్మా కథచెప్పవూ మాటిచ్చావు గదూ!... ఊఁ చెప్పుమరి" అంటూ ఉష, తల్లి గడ్డం పట్టుకొని ప్రాధేయ పడింది. ఇంతలో గేటు తెరిచిన చప్పుడు. "అమ్మా! ఎవరో వచ్చారే" అంటూ రవి చెంగున దుమికి పరుగెత్తాడు. "ఉషా, ఇప్పుడేవచ్చి చెప్పుతా ఏం .."అంటూ పద్మిని ఇంటి వసారా వద్దకు వచ్చింది.

"పద్మినీదేవిగారూ! నమస్కారం"

"ఓ .. ... చౌదరన్నయ్యగారా! నమస్కారం, రండి" అంటూ పద్మిని వసారాలో కుర్చీ వేసింది ... "ఎప్పుడొచ్చారండీ ఈఊరు?"

"ఈ రోజే! శ్రీ ధర్ ఇంకనూ రాలేదూ!"

"ఇక్కడ ఉంటేగా ఇంటికి రావటానికి"

"నాకేమీ బోధపడలేదండీ!"

"మీ మిత్రుడు ప్రభుత్వ ఆతిధ్యంలో ఉన్నాగండీ। 3 నెలలు కావచ్చాయి"

"ప్రభుత్వం ఆతిధ్యంలోనే .. ?!"

రవి, ప్రభలు ఏమీ మాట్లాడలేదు కాని ఉష తల్లి ముఖాన్ని చూచి చౌదరి ముఖాన్ని చూచింది "లేదు మామయ్యా! అమ్మ అబద్ధమాడింది. నాన్నను జైలుకి పట్టుకుపొయ్యారు" అని బిక్క మొగం పెట్టుకొంది. పద్మిని కళ్లు చెమ్మగిల్లాయి "చిట్టీ! ఎంత అమాయకురాలివే ? అమ్మ అబద్ధం ఆడిందికదూ ?" అంటూ ఆమె ఉషను దగ్గరకు తీసుకొని చిరునవ్వు నవ్వింది చౌదరీగారి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

* * *

"అమ్మా!....ఎందుకే అలా ఉన్నావు ..."అన్నది ఉష, "ఎలా ఉన్నా చిట్టీ!" అందితల్లి. "అలా అంటే అసలు అర్థమేమో చెప్పుచూద్దాం" అన్నాడు రవి.

"అమ్మ అబద్ధ మాడిందన్నావే! నీకేమో మహా తెలిసినట్టు ." అంది ప్రభ. ఉష తల్లి కుచ్చెళ్లతో తల దాచుకొంది. వెక్కి వెక్కి ఏడ్చింది. "నా బంగారు కొండవు కదూ! రా చిట్టీ! నీకు మంచి కధ చెప్పుతా" అని పద్మిని ఉషను ఎత్తుకొని కన్నీళ్ళు తుడుస్తూ "ఒరే రవీ! ప్రభా! చెల్లిని ఏడ్పించారు గదూ, మీకు సిగ్గులేదూ.........ఇదిగో చూడండి! ఉషను ఏడిపించినందుకు మీ కేమిశిక్షో తెలుసా ? నా ముద్దుల చిట్టికి మాత్రం మంచి కధ చెప్పుతా. మీ రిద్దరూ వెళ్ళిపోవాలి. యు ఆర్ ఎక్స్పెల్డు(You are expelled) ఊఁ వెళ్ళండి" అని ఏమో సౌజ్ఞ చేసింది తల్లి చిట్టి చేతులతో తల్లి కుచ్చెళు పట్టుకొని రవి, ప్రభల ముఖాన్ని చూచి మురిసిపోయింది ఉష శిక్షను శిరసా వహిస్తామన్నట్టు తలలు వంచుకొని రవి ప్రభలు వెళ్ళిపోయారు.

"చిట్టీ ఏంకధ చెప్పాలి ?"

"భస్మాసుర వరం చెప్పుతానన్నావు కదూ అదే చెప్పు" అంది ఉష.

"అయితే విను .. ఇహ అన్నయ్యకు అక్కయ్యకూ శిక్ష చాలుగదూ ? వాళ్లని కూడా రమ్మంటావూ ?"

లేడిపిల్లలా చెంగున గంతువేసి "అక్కయ్యా! అన్నయ్యా!" అని ఎలుగెత్తి పిలిచింది ఉష దాపునే చెట్లక్రింద దాక్కొన్న ఇద్దరూ బయటికి వచ్చారు. "అమ్మ! దొంగా" అని చేతులు తట్టుతూ తల్లి వద్దకు పరుగెత్తుకొచ్చింది ఉష తన ప్రక్కనే కూర్చొమ్మని ఆదేశించింది.

"అమ్మా : నీ పుక్కిటి పురాణకథలు మాకు వద్దు నిజమైన కధ చెప్పు, కదూ! ఉషా" అన్నాడు రవి.

"అవునే అమ్మా! నిజం కధ చెప్పు" అన్నది గంభీరంగా ఉష.

"నిజంగా నువ్వు కోతివే. అన్నయ్యను ఎంతబాగ అనుకరిస్తావే.... ... రవీ! నేను పురాణవ్యక్తిని కాదటోయి? అందుకనే పురాణకధల్ని చెప్పుతానంట కాని, ఇది పాత భస్మాసుర కధ కాదు. ఆధునిక .." అని తల్లి అంటుంటే, అడ్డువచ్చి ప్రభ "అయితే చాల తమాషాగా వుంటుంది. అమ్మా ఇక మొదలు పెట్టు" అంది ఉవ్విళ్ళూరుతూ.

తల్లి మొదలెట్టింది :

"నేను చిట్టిలాగు చిన్నపిల్లగా ఉన్నప్పుడు ఒక గొప్ప ఉద్యోగి ఉండేవాడు. అతని పేరు విశ్వేశ్వరరావు. అతనంటే మా నాన్నగారికి అమిత గౌరవం.

"అతని ఐశ్వర్యాన్ని హోదాను గురించీ అందరూ మాట్లాడుకునేవారు. భోగలాలసుడు అనేవారు. కొంత కాలానికి అతడు దేశభక్తుడయ్యాడు. తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాడు. సర్వసంగ పరిత్యాగి అయ్యాడు. అంతే ఐశ్వర్యాన్ని దేశ సేవకు అర్పించి వేశాడు. పంచాగ్నులమధ్య ఒక్క కాలి మీద నిలబడి దినాలు నెలలు ఏళ్ళకొలది తపస్సు చేశాడు...." "అమ్మా! మరి ఏదో తపస్సు పంచాగ్నులు తెచ్చావే" అన్నాడురవి. "పంచాంగులంటేఏమమ్మా" అని అడిగింది ఉష. "పంచాగ్నులు అని ఎందుకనిందో అమ్మ అంత మాత్రం ఊహించుకో లేవూ: అన్ని కష్టాలు పడ్డాడు. దేశసేవ చేశాడు.... అన్నమాట." అంది ప్రభ.

మళ్ళీ తల్లిఅందుకుంది. "ప్రభ ఎంత బాగా ఊహించింది. ఆ దేశభక్తుడు, దాస్యం, దారిద్ర్యం లాఠీఛార్జీలు, జుల్మానాలు, కారాగృహ వాసం అనే పంచాగ్నుల మధ్య ఘోర తపస్సు చేశాడు. అతని తపస్సు పండింది. ప్రజల అనురాగాన్ని పొందాడు. గొప్ప పదవి నలంకరించాడు. అతని ఇష్టదైవం వరమిచ్చింది అంటే ప్రజాకోటి వరమిచ్చిందన్నమాట. రవీ ... బోధ పడిందీ? ...

"దేశభక్తునికి జై! దేశబంధుకు జై! అని దేశమంతటా మారుమ్రోగింది. మరుక్షణంలోనే, దేశబంధు హృదయంలో మహత్తరమైన మార్పు ఒకటి కలిగింది. ముఖంలో ఒక మార్పు! ఆలోచనలో ఒకమార్పు! మాటధోరణిలో ఒకమార్పు! ప్రవర్తనలో ఒక మార్పు! మార్పు! మార్పు! నిలువెల్లా మార్పు! భూమ్యాకాశమంత పెరిగిపోయాడు. సింహంలాగు గర్జించాడు. కళ్ళల్లో ఒక వింత జ్యోతి. నడకలో ఒకవింతధోరణి అతని అడుగులకు మడుగులొత్తే అనుచరులు అసంఖ్యాకులయిపోయారు. భూత, ప్రేత, పిశాచ, ఢాకినీ గాలి దయ్యాల పరివారంతో పరివేష్టింపబడ్డాడు. భోగభాగ్యలాలసుడై అంతరిక్షంలో పుష్పవిమానంలో విహరించసాగాడు. దీనజనుల రక్తాన్ని పీల్చి పిప్పిచేసి ఆకలిని తీర్చుకొమ్మని దయ్యాలకూ, భూతాలకూ అనుజ్ఞ యిచ్చాడు. అడ్డువచ్చిన వారిని పట్టి పీటాడమన్నాడు. "అబ్బ! నాటి దేశభక్తుడు నేడు దేశకంటకుడయ్యాడు! నాటి దేశబంధువు నేటి రాబందు అయ్యాడు" అనేఘోష బయలుదేరింది. కరువు కాటకాలు తల విరియబోసుకొని విచ్చలవిడిగా చిందులు త్రొక్కసాగాయి. పేదల ఆర్తనాదం మిన్నుముట్టింది. "అనాధుల రక్షించు! వారు నీ అనుంగు సోదరులు" అని అశరీరవాణి పలికింది. దీనబంధువులు తండోపతండాలుగా బయలుదేరారు. దీనులను రక్షించ దీక్ష వహించారు.

"అదిగో అర్ధరాత్రిలో వజ్రాయుధాన్ని ఝళిపించాడు దేశకంటకుడు. తెల తెలవారకముందే పైశాచిక భటులు బయలు

దేరారు. దేశభక్తుల్ని, దీన రక్షకుల్ని చెరబట్టి తీసుకెళ్ళారు ..."

"అబ్బ! భయంవేస్తున్నదే" అన్నది ఉష.

"అమ్మా! యశోద అన్నయ్యనూ పట్టుకుపొయ్యారే" అన్నది ప్రభ

"రఘు నాన్నను తీసికెళ్ళారే" అన్నాడు రవి.

"ఇంతలో పదవీ గర్భంనుండి మోహిని ఉద్భవించింది. భస్మాసురుడు భస్మమైపోతాడన్న పాటకు నృత్యం చేయసాగింది. భూతప్రేత పిశాచాలతో నవీన భస్మాసురుడు .."

"అమ్మా! వద్దే, నాకు భయం వేస్తుంది" అని గట్టిగా కళ్ళుమూసుకొంది ఉష.

"అవునే! అమ్మా నాకు కూడా," అన్నారు రవి.... ప్రభ.

"ఏం భయంలేదు. తన నెత్తినే తనచెయ్యి పెట్టుకొని భస్మమైనాడు భస్మాసురుడు" అన్నది తల్లి ఓదార్పుగా.

"అమ్మా. మళ్ళీ భస్మాసురుళ్ళు పుట్టరుగదా?" అని రవి, దీర్ఘంగా ఆలోచిస్తున్న వాడిలాగా అడిగాడు.

"చస్తే. ఇంకా పుట్టేదేమిటి?" అని ఉష నిబ్బరంగా జవాబుచెప్పి, తల్లి ఒళ్లోదూరి, గెలిచినట్లు, కిలకిలా నవ్వింది.

★

## వార్తలు పంపండి!

మనం ప్రతి పట్నంలోను అనేక సభలూ సమావేశాలూ జరుపుతున్నాం. కవితా గోష్ఠులూ చర్చలూ నిర్వహిస్తున్నాం. వర్ధంతి సభలు జరిపి, ఆంధ్ర మహాపురుషుల ఉత్తమ సందేశాలను ఆంధ్రప్రజానీకానికి అందజేస్తున్నాం. మన కార్యక్రమంద్వారా ఆంధ్ర సాహితీ కళా రంగల్లో నూతన చైతన్యం కలిగిస్తున్నాం.

కాని మనం ఇంత పట్టుదలతోను, ప్రతిభతోను నిర్వహిస్తున్న ఏ సభను గూర్చి ఇంతవరకూ సమగ్రమైన వార్తలు పంపడం మాత్రం నేర్చుకోలేదు. ఎక్కడెక్కడ మన కళా రంగాల్లో ఏఏ సంఘటనలు జరిగిందీ ప్రజలందరికీ తెలియ జేయవలసిన బాధ్యత మన మీద వుంది. ఎక్కడ ఏ సభ జరిగినా దాన్ని గురించి మనంవివరంగా ఆ సభావిశిష్టతను తెలియ జేసేదిగా సమగ్రమైన వార్త ప్రచురించాలి. ఇలా వివిధ ప్రాంతాలలోని కళా కలాపాలను గూర్చి ఆంధ్ర ప్రజానీకానికి తెలియజేసినప్పుడే మన ఉద్యమాన్నిగురించి ఒక స్పష్టమైన దృక్పథం ఏర్పరచగలుగుతాం. మన కళా సాహిత్యాలకు ప్రజల ఆదరాభిమానాలు పొందగలుగుతాం. కనుక అన్ని స్థానికసంఘాల బాధ్యులూ తమ తమ ప్రాంతాల్లో జరిగే అన్ని సాహిత్య సభలనుగూర్చి సమగ్రమైన వార్తలు పంపాలని కోరుతున్నాం. ఎవరెవరు సభలో పాల్గొన్నదీ, ఏఏ విషయాలనుగూర్చి ఏమేమి చెప్పిందీ, అభ్యుదయ దృక్పథంలో ఆ సభా ప్రాముఖ్యం ఏమైనదీ స్పష్టంగా వివరాలతో సహా వార్తలు పంపాలి. ఒక ప్రత్యేక సంపాదకీయ శీర్షికక్రింద 'అభ్యుదయ'లో ఈ వార్తలన్నీ ప్రచురిస్తాం. ప్రతినెలా 25 వ తేదీ లోపుగా మీరు పంపే వార్తలన్నీ అభ్యుదయ కార్యాలయానికి చేరేలాగా చూడండి.

బెజవాడ
6—7—1947

చదలవాడ పిచ్చయ్య
కార్యదర్శి, ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం